

ఒకటే బొండం కోసము
పోటీయే సంతోషము.

# ముగ్గురు గుమాస్తాల కథ

[ఆమెతో నలుగురు]



## రాచకొండ విశ్వనాథశాస్త్రి

కలెక్టరాఫీసులో కస్పీలు దొరకని సెక్షన్లో పని చేస్తూన్న రవి, "రవికాను, నాపేరు శని" అని తరుచుగా సరదాగా అంటూంటాడు. అతను దుఃఖానికి నవ్వుపూతలు పూసుకోగలడు.

ఓ నెల పదోతారీఖున పొద్దున్నే ఆరుగంటలకి ఇంకా మంచంమీద పడుక్కొని గాఢనిద్రలో లేని రవిని అతని భార్య గట్టిగా తట్టి లేపి, పక్కన కూర్చొని, అతనికి అసలు విషయం గుర్తు చేసింది.

"ఈ పూట ఎక్కడికైనా వెళ్ళి ఎవరి దగ్గిర్నించైనా ఎలాగైనా తలైనా తాకట్టు పెట్టి ఓ పాతిక పట్టుకొస్తాఁ వన్నారు. గుర్తుందా? మరంచేత, లెండి మరి. వేగిరం లెండి. లెండి. బాబూ లెండి వేగిరం లేచి వెళ్ళి మీరీరోజు ఆ సొమ్ము తేకపోతే నేను మరింక ఈ కాపరం చెయ్యలేను, ఒక్క నిమిషం మరింక బతకలేను. ఆ ఇంటావిడ మళ్ళీ వచ్చిందంటే - ఇప్పుడే చెప్తున్నాను. నామాట నమ్మండి— నే నివాళ ఉరిపోసుకు చస్తానేకాని మరి బతకను. దాన్తోపాటు, దాని మేనల్లుడు. వాడు కూడా ఒస్తాడు. మీరేమో ఆఫీసుకి వెళ్ళిపోతారు. చిట్టిగాడు - స్కూలికి వెళ్తాడు.

నేనూ పాపా బిక్కుకూ బిక్కుకూ మంటూ కూర్చుంటాం. సరిగ్గా మధ్యాహ్నం అయేసరికి మేనత్తా మేనల్లుడూ తిన్నగా గదిలోకి, అడగనైనా అడక్కుండా ఒచ్చేసి, ఇదిగో ఈ మంచంమీదే ఈ పక్కమీదే దబాయించి కూర్చొని "తే అద్దె తే" అంటూ గంటదాకా కదల్రు. తలుపు లేసేస్తే తీసేదాకా దబదబ బాదేస్తారు. ఆ మేనల్లుడు నోళ్ళయినా విప్పడు. వాడు మాట్లాడు కాని వాడి నవ్వూ వాడి చూపూ చూళ్లేదు మీరు. వాణ్నలా చూస్తుంటే వాణ్ని పొడిచి చంపేయాలనైనా అనిపిస్తుంది. లేకపోతే, అది చెయ్యలేనప్పుడు, పొడుచుకు చావాలనైనా అనిపిస్తుంది. నిన్న మధ్యాహ్నం వాళ్ళొచ్చేవేళకి పక్క చుట్టేసి మంచం ఎత్తేసి దానిమీద నా బ్లూ చీరె ఆరేసి నేను పెట్టెమీద కూర్చొన్నాను. నా కర్మ కాలిపోయి వాళ్ళొచ్చేసరికి ఆ చీరె ఆరిపోయింది వాడు తిన్నగా ఒచ్చి ఆ చీరె తీసి, మంచం వాల్చుకుని దానిమీద ఆ చీరె పరుచుక్కూర్చున్నాడు. నెత్తిమీద నిప్పుల కుంపటి కుమ్మరించేసి వాణ్ని నిలువునా కాల్చేద్దా మనిపించింది—చేతకాని కోపం ఎంతొస్తేమట్టుకు ఏం లాభం?- నేనా చీరె పుటం పెట్టినా మరింక కట్టుకోలేను. వాళ్ళ డబ్బు వాళ్ళ మొహాన్న పారేస్తే గాని నేను మరింక బతకజాలనుగాక బతకజాలను. ఈ అవమానాలు నేను భరించలేను. భరించలేను. నిన్నరాత్రి మంచం మీద పడుకోక్కుండా చాపమీద ఎందుకు పడుక్కున్నానని మీరంటే నేనేవీ చెప్పలేకపోయేను. పెదివి కదిపితే ఏడుపులో మునిగిపోదు నన్నమాట. మంచంగురించీ చీరెగురించే కాదు. నిన్న ఆ ఇంటిది ఏంవన్నదో చెప్పడానికి సిగ్గేసి ఒళ్ళు చచ్చిపోయి మీకో చెప్పలేకపోయేను. "అమ్మా! ఆడదాన్ని నన్నిలా హింసించడం పాపం దా?" అన్నాను. అంతే అన్నాను. దానికి ఆవిడ ఏం వంటో తెల్సా? తల్చుకొంటే నా మనసంతా మరిగిపోయింది. ఆపలేని దుఃఖం ఒస్తోంది. మనం ఎవరియెడల ఏ పాపం చేసేం? ఏ పాపాలైనా చేసేవాం? చేస్తే, తెలీక చేసేవేం మోగాని తెలిసీ చెయ్యలేదుకద. కాని, తెలిసీ తీరి కూర్చుని ఇంత మంది నిరపరాధుల్ని అంతమంది ఇలా ఈ విధంగా హింసిస్తుంటే, పట్టపగలు పది మంది యెదటా ఇంతలేసి అన్యాయం ఇలా జరుగుతూంటే లోకం ఇంకా ఎందుకు మండి మసై పోడంలేదో నాకు తెలీడం లేదు. ఇన్ని దుఃఖాలు పెట్టీకంటె, పోనీ, ఒక్కసారే మనందర్నీ కాల్చి చంపేసి ఆ దేవుడు వాళ్ళనే హాయిగా బతకనివ్వకూడదా? ఎందుకు మనల్ని పుట్టించడం? ఎందుకీవిధంగా హింసించడం? అయినా, కట్టెదుట పాపాల్చేసే మనుషుల్నే 'ఏవర్రా ఎందుకు చేసేరు?' అని అడగడానికి నోర్లేదు మనకి.. మరింక ఆ దేవుణ్ని ఇంకేం అడగ్గలం? కాని ఏడవకుండా ఉండలేంకద! దానిక్కూడా నోళ్ళు కట్టేస్తారా? కట్టేసీయండి. ఏడ్చి మనం సాధించే దేవుంది గనక! కాని నిన్న మధ్యాహ్నం అదన్న మాటలు.... [బోలెడ్డబ్బు తగలేసి, ఉత్తిపుణ్యానికి నిన్నూ నీ మొగుణ్నీ ఇందు మీద పండబెట్టడానికి కొనుక్కోలేదు పిల్లా నేనీ ఇల్లు! అంత పుణ్యానికే పోవాలంటే నా మేనల్లుడే ఉన్నాడు. నిన్ను కాకపోతే నీలాటివాళ్ళని పదిమందిన్తెచ్చి వాణ్ని పండబెట్టగల నిక్కడ! తెల్సిందా? ఆపాటిదానికి నీ మొగుడికెందుకు ఇల్లిచ్చుకోడం? అద్దిమ్మంటే నోరుందికదా అన్చెప్పి పెద్ద కబుర్లాడకు! మేం వూం ఆడగలం ఆపాటి ఆడ్డానికి ఆపాటి నోళ్ళు మాకూ ఇచ్చేడు భగవంతుడు. నీకున్న పౌరుషం నీ మొగుడికే ఉంటే ఆపాటి అద్దెడబ్బులు మా మొహాన్ని ఎప్పుడో పారేసును. అంతపాటైనా చేతకానివాడికి ఈ యిల్లూ మంచమున్వూకూడా ఎందుకు? అంతగా కావాలంటే మా ఇల్లే దొరికిందేంటి? పోయి ఏ చెట్టుకిందో ఉండరాదా? కాణీ అద్దె ఇవ్వక్కర్లేదు కద? ఆడదాన్నిట! హింసల్టి పెట్టేస్తున్నాంట! ఏం? నా అద్దె నాకు పారేక నన్నిలా ఎండలో తిప్పి నన్ను హింసలు పెట్టడం లేదా నువ్వు? నే నాడదాన్నికానా?! ఆడదెవరో మొగాడెవరో తెలీకుండానే కాపరం చేసి పిల్లల్ని కన్నానా?.?] ఆ మాటలన్నీ చెప్పడానికి నాకు నోర్రావడంలేదు. మనం ఈ యింట్లోంచి పోదాం! చెట్టుకిందికే పోదాం మనకి ఈ యిళ్లెందుకు, ఈ వూళ్లెందుకు ఈ నౌకరీ చాకిరీ లెందుకు? పక్షులు బతకడంలేదా! పశువులు బతకడంలేదా! చెట్లకిందికే పోదాం. అవి లేకపోతే ఆపాటి పడి చావడానికి నూతుల్లేవా?! గోతుల్లేవా?! అంతకీ ఏదీ లేకపోతే, మహాసముద్రం లేదా? అందులోకి పోతే అక్కణ్నించి మనల్నెవ్వరూ పొమ్మన్లేరుకద!" అంటూ కళ్ళొత్తుకొంది రవిభార్య.



రవి భార్యకి ఇరవైమూడేళ్ళుంటాయి. ఆవిణ్ని చూస్తే పచ్చగా బరువుగా పళ్ళతో నిండిపోయి వడదెబ్బకి వడిలిపోయి ఎండలో జాలిగా నిల్చున్న లేత బొప్పాయి మొక్క గుర్తుకొస్తుంది. రవి కంటికి ఆమె ఎప్పుడూ, తిండిలేని సీతలాగా, ఆకల్తో అడివిలో తిరిగే దమయంతిలాగా కనిపిస్తుంది. రవికి ముప్పయ్యేళ్ళున్నాయి. అతను చీకటికొట్లో ఎండుగడ్డి వేడిలో ముగ్గబెట్టి బలవంతంగా పండబెట్టిన లేలేత మావిడికాయిలా పండిపోయుంటాడు.

అతని తలమీది జుట్టు చాలాకాలంనించీ రాలిపోతోంది. వర్షంలో తడిసిపోయి పాడైపోయి చెడిపోయిన కొత్తచీపుర్లా ఉంటున్నాడిప్పుడతను. వాళ్ళిద్దరికీ ఎనిమిదేళ్ళ కొడుకూ అయిదేళ్ళ కూతురూ ఉన్నారు.

భార్య చెప్పే మాటలన్నీ వింటూ మంచంమీద వెల్లకిలా పడుక్కున్న రవి ఆవిడ తల తన గుండెకి చేర్చుకున్నాడు. అంతా చెప్పి లేచి ఆమె కళ్ళొత్తుకుంటుంటే, చివరికి ఉండబట్టలేక, "అత్తముండనీ అల్లుడు వెధవనీ చంపేస్తాను." అన్నాడు రవి.

"దేంవుడూ గవర్నమెంటూ అంతా వాళ్ళ పక్షవేం ఉంటే మీరూ నేనూ ఏం చెయ్యగలం? ఏం చెయ్యలేకపోయినా ఆ దేవు డొక్కసారి కనిపిస్తే — కనిపించడు. కనిపిస్తే పేదవాళ్ళంతా గుట్లపీకి చంపేస్తారని భయం! నాకుట్టుక నేను ఓ బుగ్గపోటైనా పొడవకపోతే నా మనసు శాంతించదు. అందుకే కనిపించడు పెద్ద మనిషి! పోన్లెండి. ఉణ్నీయండి. అందర్నీ వాళ్ళ పక్షవేం ఉణ్నీయండి. నిండా మునిగేక ఇంకేం భయం? భయపడద్దు మనం. వాళ్ళకి అద్దె ఇవ్వొద్దు మనం. అంతగా అయితే ఏ బైరాగి సత్రానికైనా పోదాం కాని వాళ్ళకి అద్దె ఇవ్వొద్దు మనం." అంది రవి భార్య.

భార్యకి బాధతప్ప మరేం తెలియదని రవికి తెలుసు. తను చెయ్యలేని పనులేవిటో కూడా అతనికి తెలుసు. పెళ్ళి. వాళ్ళని చంపలేడు. పిల్చి దేవుణ్ని పలికించుకోలేడు. అర్జీ రాసుకునైనా గవర్నమెంటునేదీ అడగలేడు. సంసారంతో బైరాగిసత్రంకి పోలేడు. కట్టగట్టుకు సముద్రంలోకి ఉరకలేడు.

అందుచేత, సరిగ్గా ఏడోగంటకల్లా, పాతిక రూపాయల అప్పు వేటకి, గదిలోంచి బైటికి నడిచేడు రవి.

సుధపేరు సుధాకర్. కలెక్టరాఫీసులో కొద్దిగామాత్రం కస్సీలు దొరికే సెక్షన్లో పనిచేస్తున్నాడతను. వయసు పాతిక. గుమాస్తా, బ్రహ్మచారి. కొంచెం అందంగా కొంచెం టెక్కుగా షోగ్గా అతను గుమాస్తాగా మారిన పడుచు ప్రెమ్సీ కలెక్టర్లా ఉంటాడు.

బట్టలమీద మోజుకొద్దీ పెళ్ళి మానుకున్నాడు సుధ. అతనికి సినిమాలసరదా, నాటకాల పిచ్చికూడా ఉన్నాయి. ఆ పిచ్చి సరదా మోజులకీ పెళ్ళికీ సహజ వైరం ఉంది. పెళ్ళి చేసుకున్న గుమాస్తాల బాధల్ని పక్కనిలబడి మరీ చూసేడు సుధ. అందుచేతనే అతనికి భయం పెళ్ళంటే, కాని, అతనికి ఆడదంటే చిక్కని మోజుంది. పెళ్ళి లంకె తగుల్చుకోకుండా అతను చిలక్కొట్లతో కాలక్షేపం చేస్తున్నాడని అందరికీ తెలుసు. అతనికి తల్లి తండ్రి అన్నదమ్ములూ అప్పచెల్లెళ్లూ ఎవరూ లేరు. ఒక చిన్న మేడమీద, ఒక చక్కని చిన్నగదిలో కాలక్షేపం చేస్తున్నాడతను.




సమస్త బంధువుల్తోనూ అలరారుతూన్న గుమాస్తాలతన్ని "లక్కీఛాన్సుగాడు!" అంటారు.

సుధకి టెర్లిన్ షర్ట్స్ అంటే ఇష్టం వున్నట్టే సుశీలకి నైలాన్ చీరెలంటే ఇష్టం ఉండేది.

సుశీల ఒకప్పుడు ఎమ్బీబియెస్ చదువుదామనుకొంది. మరొకప్పుడు సినిమాల్లో చేరిపోదామనుకొంది. ఓనాడు 'కష్టజీవులు' సిన్నిమా చూసి హీరాయినిగ్గా ఏ మంచి కూలివాణ్ణయినా పెళ్ళాడేద్దునా అనుకొంది. మరోనాడు, వాళ్ళ వీథిలోనే ఉన్న సరసుడూ తాగుబోతూ జూదగాడూ దొంగా దగాకోరూ అందగాడూ అయిన నడికాలపు గూండాని అందర్నీ ధిక్కరించి పెళ్ళాడి పరమ పతివ్రతగా ఉంటూ తన పాతివ్రత్య బలంచేత వాణ్ని పరమ భాగవతోత్తముడిగా మార్చేద్దునా అనుకొంది. ఓసారి ఏ అమెరికా అయినా ఎగిరిపోదునా అనుకొంది. మరోసారి, తనని ఏ పడుచు చీఫ్ మినిస్టరో, రాజాసాహెబో, కలెక్టరో లేక నాలుగు కాళ్లున్న కంట్రాక్టరో పెళ్ళాడకూడదా అనుకొంది.

ఆ అనుకోడాలూ ఊహలూ అవన్నీ ఆమెకి పద్దెనిమిదేళ్ళు నిండకముందు. ఇప్పుడుకాదు. ఇప్పుడామెకి ఇరవైరెండేళ్ళు దాటేయి. సుధ పనిచేసే సెక్షన్లో టైపిస్టుగా చేరిన తరవాత సుధని చూసేక అతన్తో పరిచయం అయ్యాక ఆమెకి నగలూ నైలాన్ చీరెలూ అక్కర్లేకపోయేయి. సుధని పెళ్ళాడి ఆ మేడమీద ఆ చక్కని చిన్న గదిలో అతన్తో కాపరం చెయ్యడం. అదే





కావాలనుకొంది; అదే చాలు నదే స్వర్గం అనుకొంది.

మొదటిరోజుల్లో ఓరోజు మధ్యాహ్నం సుధతో ఏదో మాట్లాడుతున్నట్టు మాట్లాడుతూ తన ఫ్లాస్క్ తీసి మర్యాదకి ఇచ్చినట్టు తన కాఫీ కొంత అతనికిచ్చింది సుశీల. అక్కణ్ణించి కాఫీలు ఇచ్చి పుచ్చుకోవడాలు ప్రారంభమయేయి. ఓనాడు ఇద్దరూ కలిసి హోటల్కి వెళ్ళిన మొదటి రోజున - అతను బిల్లు చెల్లిస్తే, "ఒద్దు మీరివాళ చెల్లిస్తే, రేపు మరెవరైనా చెల్లిస్తా నంటారు." అంది సుశీల. "నేనుండగా మరెవర్నైనా చెల్లించనిస్తానా?" అని అతనంటే సిగ్గునవ్వు నవ్వి మనసులో అతని మాటల్ని దాచుకొంది. మూడుసార్లు అతనితో కలిసి సినిమాకి వెళ్ళి నాలుగోసారి వెళ్ళినప్పుడుమాత్రం అతన్ని తన కుడి చెయ్యిమాత్రం పట్టుకోనిచ్చింది. ఆ రాత్రి అతనితో రిక్షాలో కూర్చొని రాడానికి చాలా సిగ్గుపడింది. ఓరోజు సాయంత్రం అతను జాకెట్పీస్ కొనిస్తే "చెప్పకుండా ఎందుకొన్నా"రని మారాం చేసింది. "రేపు టిష్యూచీరె కొంటాను." అని అతనంటే" "ఒద్దు. డబ్బు ఖర్చు." అంది సీరియస్గా. అదే సాయంకాలం బాగా చీకటిపడ్డాక బీచిని మసక వెన్నెల్లో అతన్ని ఒక్క ముద్దుమాత్రం పెట్టుకోనిచ్చి ఆ తరవాత ఎందుకో దుఃఖం రాగా కళ్ళు తుడుచుకొంది. తన నతను ఓదార్చబోతే కొంత మేరవరకు మాత్రం ఓదార్చనిచ్చింది.

"టిస్యూచీరె కొనీదా?" అని అతను మళ్ళీ అడగ్గా సరేనన్నట్టు తలఊపి. "నీఇష్టం" అంది. అతన్ని పెళ్ళాడ్డంకోసం ఆమె తహతహలాడిపోయింది.

సుధమాత్రం ఆడవాళ్ళు మగవాళ్ళకీ మగవాళ్ళు ఆడవాళ్ళకీ రాసేకథలు చదివేడు కాబట్టే వాటిలో నాయకుల్లా "నాది ప్రేమా, వాంఛా? ఆమెది వాంఛా లేక ప్రేమా?" అని తర్కిస్తూ కూర్చున్నాడు. తర్కం తేల్లేదు కాబట్టి ఆమెతో పెళ్ళిసంగతి మాట్లాడ్డం మానీసేడు.

సుశీల ఆమర్నాడు ఆఫీసుకి ఆలస్యంగా వచ్చిన సుధని దూరంనించి నవ్వుతూ పలకరించి నవ్వుతోనే దగ్గరకి రమ్మంది. అతను 'పనిలో మునిగిపోయి' రెండుగంటలయేక ఆమెదగ్గరికి వెళ్ళేడు. వెళ్ళేక, అతను ఫ్రీగా మాట్లాడలేకపోడం గమనించి ఆమె కూడా ముక్తసరిమాటల్తో సరిపుచ్చింది. ఆ సాయంకాలం, "ఇంకా వందకాయితాల పనుంది. నాకోసం వెయిట్ చెయ్యకు!" అన్నాడతను. సరేనని వెళ్ళిపోయిన సుశీల ఆ మర్నాడు అతన్ని నవ్వరాకుండానవ్విన పెదవుల్తోపలకరించింది. మాట్లాడ్డంమాత్రం మానేసింది. రెండు, మూడు, నాలుగు. ఐదురోజులు మాట్లాడ్డం మానేసింది. ఆమె తనతో మాటలు మానేసిందన్న సంగతికి బాధపడ్డ సుధకి తనామెతో మాట్లాడలేదన్న సంగతి గుర్తురాలేదు. ఆరోజున మాత్రం ఆమె ఆఫీసుకి వస్తూండగా వరాండాలోనే ఆపి ప్రేమా కోపం అభిమానం అన్నీ ఒక్కుమ్మడిగా ఒక్కప్రశ్నలో ఇమిడ్చి, "టిస్యూచీర కొనేదా, ఒద్దా?" అని బింకంగా అడిగేడతను. సుశీల అతని కళ్ళల్లోకి సూటిగా చూసి, "నా నిర్ణయంతో మరింక పనిలేదు. నిర్ణయించుకోవల్సింది మీరు." అంది 'భావగర్భితంగా'. "నన్ను పెళ్ళాడదల్చుకొంటే చీరెకొను. లేకపోతే నాకు నీ చీరెలూ ఒద్దు, నువ్వూవద్దు." అని ఆమె చెప్తోందని స్పష్టంగా బోధపడింది సుధకి.

"ఇద్దరి జీతాలూకలిపి ఇద్దరికీసరిపోవా?" అనుకొంటూనే ఉన్నాడు ఆరోజల్లా ఆఫీసులో సుధ. కాని, ఇద్దరు ఒకఏడాదిలో ముగ్గురవుతారు. ముగ్గురు మరికొంత కాలంలో నలుగురైదుగురవొచ్చు. అంతలో బాధలమబ్బులూ కష్టాలవర్షాలూ తయారవుతాయి. సినిమా ఉండదు, నాటకాలుండవు; దోసె కాఫీ సిగరెట్లుండవు! చెప్పులుండవు, సైకిలుండదు; బస్సులుంటాయికాని వాటిలో ప్రయాణాలుండవు; పాలు వెన్న రొట్టె ఏదీ ఉండదు: పెరుగు, కక్కలు, కాయగూరలు టూత్‌పేస్టు, హేరాయిలు, పేపర్లు, పత్రికలు నావెల్సు, ఏవీఉండవు. బట్టలు! బట్టలుండవు. గొప్పతగ్గింపుధరల వారాల్లో ఖద్దరు బట్టలు కొనుక్కోవాలి, చవక నూలుగుడ్డలు ఎంచుకోవాలి. అంతకిమించి గత్యంతరం ఉండదు. మరింక -పిల్లలు, జబ్బులు, మందులు, చావులు? ఏంబ్రతుకు బ్రదర్! భయం వేస్తోంది.

"ఏంచెయ్యడం?" అని మధ్యాహ్నం లంచ్‌లో ఓస్నేహితుణ్ని సలహా అడిగేడు సుధ.

"సుధా బ్రదరూ! పెళ్ళాడకముందు ఇన్ని ఆలోచించే గుమాస్తాగాడివి ఆడి మాత్రం ఏం సుఖపడాలి?" అన్నాడతను.

అయితే-సుధకి సుశీలతో సుఖపడాలనే తీవ్రమైనకోరిక మాత్రం లేకపోలేదు.

ఆ సాయంకాలం అతను ఆఫీసునించి రూంకి వస్తూ దార్లో పావలా షేవ్‌చేయించుకొని, రూంకి వచ్చి స్నానంచేసి, బజారుకి వెళ్ళేవాళ్ళా ఫుల్‌గా డ్రెస్సై టాయ్‌లెట్ అయి మంచంమీద కూర్చొని, "టిస్యూచీరె కొనడమా, మానడమా?" అని తర్కిస్తున్నాడు. అతనికేమీ పాలుపోడంలేదు. అప్పుడతని చేతిలో సరిగ్గా ఇరవైతొమ్మిది రూపాయల నోట్లూ, ఒక ఇచ్చరూపాయీ ఉన్నాయి. ఆలోచించి ఆలోచించి చివరికతను ఆ ఇచ్చ రూపాయి టాస్‌చేసి పెళ్ళో బ్రహ్మచర్యమో తేల్చిపారేద్దామనుకున్నాడు.

అంతలో బాబులు (అనే జగన్నాథం) వచ్చి సుధపెళ్ళి ప్రయత్నం ఆపుచేసేడు.

"మళ్ళీ మా జీతాల్రోజున ఇచ్చేస్తాను ఒక్కముప్ఫయ్! ప్లీజ్ ప్లీజ్! నీగెడ్డంపట్టుకు బతిమాల్తాను." అన్నాడు జగన్నాథమనే బాబులు.

"ఉండండి! మండుతుంది. ఇప్పుడే షేవ్ చేయించేను." అన్నాడు సుధ, ముఖం వెనక్కిజరుపుకొని. (పెళ్ళాడి పాతైపోతే వారానికొకసారే షేవు!)

"అయితే చేతు లిలా ఇయ్యి" అన్నాడు బాబులు.


"ఉండండి. ఎంతకావాలి మీకు?"

"ఒక్కముప్ఫయ్!"

ఆ'ముప్ఫయ్'ని మూడుపైసల్లా ధ్వనింపజేసేడు బాబులు.

"పట్టుకువెళ్ళండి." అని సంతోషంతో ఆ సొమ్ము అతనికిచ్చేసి, "హమ్మయ్య", అని నిట్టూర్చేడు సుధ. చీరె కొనడానికి డబ్బులేదుకాబట్టి అది కొనడమా, మానడమా అనే సమస్యేలేదు. అది పరిష్కరించే బాధాలేదు. వచ్చేనెల చూసుకోవచ్చు.

ఆ వచ్చేనెల వచ్చివెళ్ళింది. మరోనెల వచ్చి అదికూడా వెళ్ళింది. ఇంకోనెలకూడా తొందరగావచ్చి లక్షపనులు చక్కబెట్టి చక్కావెళ్ళింది. మూడునెల్లోకూడా కోట్లకొద్దీ జనంచేత కోట్లకొద్దీ పనులు చేయించేయేగాని సుధచేతమాత్రం టిస్యూచీరె కొని



పించలేకపోయేయి. అంతలో నాలుగోనెల నెమ్మదిగా దొంగలావచ్చి సుశీలని చల్లగా కారెక్కించి ఒక రిటైర్డు పోలీసుఆఫీసర్తో పెళ్ళికి రెజిస్ట్రార్‌వారి ఆఫీసుకి తీసుకుపోయింది.

పెళ్ళిరోజు పొద్దున్నే సుశీల సుధ రూంకి వచ్చి, శుభలేఖ స్వయంగాఇచ్చి, పెళ్ళికి రమ్మని పిల్చి, "మా పెళ్ళికి సాక్షిసంతకం మీరుకూడా చెయ్యాలి. తప్పకరండి," అంటూ నవ్వుతూ అతనిముఖంలోకి చూసి, ఆవెంటనే కోపంతో ముఖం ఎరుపుచేసుకొని, అంతలోనే దుఃఖంతో వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ నవ్వు అతన్తో, "ఈ పరిస్థితికి కారణం నువ్వేసుమా!" అంది. ఆ కోపం అతన్ని, "నా దుస్థితికి కారణం నువ్వే కదా?" అని నిలదీసి అడిగింది. ఆ దుఃఖం అతన్తో, "నేన్నాశనం అయితే అందుకు కారణం నువ్వే నువ్వే!" అని జలజలా రాల్తూ జాలిజాలిగా చెప్పింది.

అప్పణ్నించీ సుధాకర్ కొంతకాలం దేవదాసుగా తిరిగేడు, తనబాధకి తను (కూడా) కొంతకారణం అని అతనికి తెలుసు. అంచేతనే అతనికి మరీ బాధగాఉంది. కాని, "సుశీల నన్నర్థంచేసుకోలేదు." అని సమాధానపర్చుకొందికి ప్రయత్నం చేసేడు. గుమాస్తాగాడు పెళ్ళిచేసుకొంటే ఐట్టికి భోజనానికి వాచిపోయే ప్రమాదం ఉంది కదా: అలాభయపడ్డంలో నాతప్పేంవుంది? సంఘం అలా వుంది. అందుకు నేనేం చేసేది? సంఘంలోఉన్న పెద్దతప్పు నామీత్తోస్తే ఎలా?—అని అతనుబాధపడి చాలా చిరాకుపడ్డాడు. పోనీ, నాతో 'ఇదిగో సుధా! నువ్వు నన్ను పెళ్ళాడకపోతే నేను చచ్చిపోతాను, లేకపోతే ఎక్కడికైనా పారిపోతాను. లేకపోతే నీమీద కోపంచేత ఏ ముసిలాణ్నయినా ఎవణ్నయినా పెళ్ళాడేస్తాను!' అని సుశీల స్పష్టంగా చెప్పేస్తే ఎంతబావుణ్ను !....కాదు! నాదే తప్పు. నాదేతప్పు—కాదు!సంఘం దీతప్పు. పువ్వులాటి పెళ్ళిని మాకు పెద్దపులికోరలా తయారుచేసిన పెద్దల సంఘందీ తప్పు!

అలా బాధపడుతూ చిరాకుపడుతూ కాలం గడుపుతున్నాడు సుధ. ఈలోగా సుశీల ఉద్యోగం మానేసింది. ఆమె పెళ్ళి జరిగి అప్పుడే రెణ్నెల్లయింది. రెండురోజుల్నించీ సుధాకర్ మూడ్ పూర్తిగా మారిపోయింది. ఇప్పుడతను లోకులంతా బహు దుర్మార్గులూ పరమరాస్కెల్సూ అనే చీకటి కోపంతో ఉన్నాడు.

ఉదయం ఎనిమిదిగంటలకి అత నటువంటి డార్క్‌మూడ్‌లో ఉండగా రవి నెమ్మదిగావచ్చి భయం భయంగా పాతికరూపాయలు అప్పడిగేడు.

"ఇవ్వను, ఇవ్వనుకాక ఇవ్వను. ఎందుకివ్వాలి?" అనేద్దామనుకున్నాడు సుధ.

కాని అంతలోనే అతనికి కొంచెం, అతికొంచెం ఒక్క మూడుమిల్లీమీటర్ల చిరునవ్వొచ్చింది. లోకులంతా ద్రోహులనీ దుర్మార్గులనీ ఈ సుధకి తెలుసు. తెలిసినా ఈ సుధాకరుడు వారికి మేలుచెయ్యడం మానడు. ఏదో తెలియనితనంవల్ల ఆమె యెడల ఎట్టితప్పిదం చేసినా ఈ సుధాకరుడు దానశీలుడనీ దయార్ద్రహృదయుడనీ ఆ సుశీలకూడా ఒప్పుకుతీరాలి. అవును ఎంతో మంచివాడు మాసుధ.






ప్రకాశంగా రవితో, "ఇప్పుణ్నాదగ్గిర అయిదున్నాయి. అందాకా పట్టికెళ్ళు. మిగతా ఇరవై ఇవాళ పదో తారీకు కాదూ? ఇవాళే రైల్వేవాళ్ళ జీతాల్రోజు. బాబులు నాకు సొమ్మివ్వాలి. అడిగితెస్తాను. సాయంకాలం రా!" అన్నాడు సుధ. అతనికి రవిని చూసి చిన్నమెత్తు అసూయా ఎక్కువగా జాలీ కలిగేయి. "అయితే, సాయంకాలం నా మాట మర్చిపోకుస్మా! మర్చిపోతే చచ్చిపోతాను!" అంటూ లేచి వెళ్ళిపోబోతున్న రవిని ఆపి,

"రవీ! పెళ్ళిచేసుకున్న గుమాస్తాకి పరమవీరచక్రం ఇవ్వొచ్చు రవీ!" అన్నాడు సుధ.

"మిగతా ఇరవైఇస్తే నాకు ప్రాణాలిచ్చినట్టేలెక్క." అన్నాడు రవి.

జీతాలరోజేకాని బాబులు ఆఫీసుకి వెళ్ళలేదు. తోడిగుమాస్తాకి తనజీతం పుచ్చుకొనే ఆథరైజేషన్ లెటరిచ్చి సెలవుపెట్టి ఇంటి దగ్గరే ఉండిపోయేడు.

బాబులికి రవీంద్రనాథ్‌టాకూరంటే ఇష్టం లేదు. ఎంచేతనంటే అతనికి కాబూలీభయం ఉంది. చెల్లులేనివడ్డీలు చెల్లించిచెల్లించి మరి చెల్లించలేక చేతులెత్తి నిల్చున్న బాబుల్ని కాబూలీవాడు సివిల్‌జెయిల్‌కి పంపిద్దామని చూసేడు. నేను ఇచ్చుకోగలిగిన్ని ఇచ్చుట మానివేయడంలేదనిన్నీ. నేను కానీ మిగలకుండా కాలక్షేపం చేస్తున్నవాడి ననిన్నీ" బాబులు కోర్టువారికి నిరూపించుకొని జెయిలు తప్పించుకున్నాడు. జీతంలో మిగతా అప్పులవాళ్ళ కోతలు అప్పటి కప్పుడే పోతూనే ఉండడంచేత కాబూలీవాడికి ఆఫీసుగేటు కాయక తప్పిందికాదు.



అందుచేత జీతాలరోజుల్లో బాబులు ఆఫీసుకి వెళ్ళడు.

బాబులు ముఖం, అప్పులవాళ్ళెక్కడ కనిపిస్తారోఅని కనిపెట్టుకు తప్పించుకు తిరిగే యాభయ్యేళ్ళ ముఖంలా ఉంటుంది. అతనిజుట్టు డెబ్భయ్యేళ్ళదాన్లా ఉంటుంది.

అతనెప్పుడూ తోడేళ్ళకి భయపడే ముసిలి కుందేల్లా కనిపిస్తాడు; గడపదాటి వీధిలో కెప్పుడొచ్చి తిరిగినా, పిల్లిఉన్న ఇంట్లో ఎలుకతిరిగినట్టు వారవారలంట తిరుగుతాడు. ఎవరైనా అతన్ని ఇంటికివెళ్ళి పిలిస్తే అతను వెన్వెంటనే బైటకిరాడు. ఆ వచ్చినవ్యక్తి 'క్రూరజంతువు' కాదని నిర్ధారణయితేగాని తలుపుతియ్యడు. ఇంట్లోవాళ్ళని "బాబులున్నాడా ?" అని అడిగితే ఎందుకైనా మంచిదన్చెప్పి వాళ్ళెప్పుడూ "లేరు లేరు"నే జవాబు చెప్తారు. ఆఫీసుకివెళ్ళే బైంకి బాకీదార్లు దారికాస్తారని భయపడి అతను బైంకి రెండు గంటలముందే ఆఫీసుకిపోయి కూర్చుంటాడు. లోనికివెళ్ళేక కాఫీక్కూడా మళ్ళీ బైటకిరాడు. ఆఫీసునించి ఇంటికి రావడంలోకూడా అతను ఎంతోచాతుర్యంచూపిస్తాడు. అతను ఒక్కొక్కప్పుడు ఇంటికి వెళ్ళనేవెళ్ళకుండా స్నేహితుల ఇళ్ళ దగ్గిర ఉండిపోతుంటాడు. అతను కత్తులమీద నడిచేవాళ్ళాగా ముళ్ళమీద గెంతేవాళ్ళాగా కనిపిస్తాడు. కొత్తగావచ్చే కుర్రగుమాస్తాలతో అతను "ఒరిజినల్ గుమాస్తాగాణ్ణి నేనూ! కార్బన్ కాపీగాళ్ళమీరు." అంటూంటాడు.

బాబులనే జగన్నాధానికి నలభయ్యేళ్ళ వయసులో ఇప్పుడిరోజున, పెళ్ళికాని చదువులేని ఇరవై రెండేళ్ళ కూతురూ, మెట్రిక్కు పాసవని నౌఖరీదొరకని పెళ్ళికాని ఇరవయ్యేళ్ళకూతురూ, చదువుసరిగా అబ్బని పద్ధెనిమిదేళ్ళ కొడుకూ, పదకొండోయేటనించీ పెళ్ళికోసం తహతహలాడిపోతున్న పదహారేళ్ళకూతురూ ఎడంకాలు ఎండిపోయిన పన్నెండేళ్ళ కొడుకూ నెత్తిమీదిభారంతో బుద్ధిలో పండుముసిలైపోయిన పదేళ్ళ కూతురూ ఉన్నారు. బాబులుభార్య తరుచు కనిపించదు. ఆవిడ పొగల్లో ఉంటుంది. ఆవిడ మనిషిలా ఉన్నప్పుడెలా ఉండేదో బాబులికే సరిగ్గా గుర్తులేదు.

బాబులెప్పుడూ దుఃఖానికి నవ్వుపూతలు పూసి భద్రంగా దాచుకోడు. దాన్ని చిరాకుతో అణిచేబోతాడు. కోపంతో చంపేబోతాడు.

సాయంకాలం ఆరుగంటలకి బాబులు ఇంట్లో చిరాగ్గా కూర్చున్నాడు. జీతంఇంకా రాలేదు. సుధవచ్చి పీకలమీద కూర్చొనే వైనమవుతోంది. అతన్ని ఎలా తప్పించుకోడం?

"తప్పించుకోడం అవసరమా?" అని కూడా ఆలోచిస్తున్నాడు బాబులు.

సుధంటే బాబులికి అభిమానమూ కోపమూ కూడా ఉన్నాయి. తన మూడో కూతురికీ సుధంటే మోజుందనీ ఆ పిల్లయెడల సుధకి మోజు లేకపోలేదనీ అతనికి తెలుసు. బీదవాడి కూతుర్ని సుధ పాడుచెయ్యకుండా ఊరుకున్నాడనికూడా అతనికి తెలుసు. ఆ పిల్లంటే సుధకుండే మోజు ఆధారం చేసుకొని, తన్ను అతడ్దగ్గిర్నుంచి అప్పులు లాగ్గలిగేడని కూడా తెలుసు. అందుకే బాబులు తనని చూసి తను అసహ్యించుకుంటాడు. ఆ అసహ్యాన్ని కోపంగా మార్చి ఆ కోపాన్ని ఆ కూతురిమీదికి ట్రాన్స్‌ఫర్‌చేసి ఆమె ఏ చిన్న తప్పు చేసినా ఆమెని చితక్కొట్టి చివరకి "నా పాపానికి నన్నెవరు కొడతారు? ఇన్ని పాపాలు చేయించే - ఆ దేవుడుగాణ్ణి - వాణ్ణెవరుకొడతారు?" అని పళ్ళు పటపట కొరుక్కుంటాడు.

సాయంకాలం చిరాగ్గా కూర్చున్నాడు బాబులు.

సుధ మంచివాడే. అప్పిచ్చి మళ్ళీ అడిగే మనిషికాడు. కాని ఇవాళ పొద్దున్నే వచ్చి అడిగేడు. కావాలంటే ఓ అయిదు, ఇంకా కావాలంటే ఓ పది కొట్టేసుకునైనా ఇస్తే కాని వీల్లేదన్నాడు. అదీ బాగానే ఉంది. న్యాయంగానే చెప్పేడు. (దీన్ని వాడు పెళ్ళాడేసినా బావుణ్ను.") న్యాయంగా చెప్పినప్పుడు మనం మరోలా ఉంటే మనకింక అప్పు పుట్టదు. పోనీ ఇచ్చేద్దాం సొమ్ము. కావాలంటే మళ్ళీ వాణ్నే అడగొచ్చు.—

అని నిశ్చయించుకున్నాడు బాబులు.

అంతలో ఆరుంపావుకి తోడి గుమాస్తా వచ్చేడు.

"నువ్విమ్మన్న వాళ్ళందరికీ ఇచ్చేసేను. ఇవిగో రశీదులు. మిగిలినవి ముప్ఫయ్. ఇందులో నా అయిదూ ఇదుగో తీసుకుంటున్నాను. మిగతావి పాతిక. లెక్కెట్టుకో," అంటూ అతను పాతికరూపాయలు బాబులి చేతి కిచ్చేడు.

"నీ అయిదుకీ నాలుగురోజు లాగలేవా?" అని, రాళ్ళు కరిగించే స్వరంతో అడిగేడు బాబులు.

"ఆగలే నాగలేను! నాల్రోజులు పోయేక ఎక్కణ్ణించైనా తెచ్చి మళ్ళీ ఇస్తే ఇవ్వగల్నేమో కాని ఇప్పుడుమాత్రం ఆగలేను" అని గాభరాగా అన్నాడు తోడి గుమాస్తా. కరిగిపోతానేమోననే భయంతో గడగడ వణికిపోయేడతను. ఆ అయిదూ ఇవ్వకుండా ఉండడానికి మర్నాడు యాభై వేలిస్తానని ప్రామిస్ చేసీగలడతను ఆ సమయంలో.

"వారం రోజుల్లోపల ఎప్పుడు సర్దినా సరే! నీ దయ! " అన్నాడు బాబులు. ఆతరవాత ఎదర వరసలో కొంతదూరంలో కనిపించే మేడమీదిగది చూపించి "చూడొరే బాబూ!సుధాకరం రూంలో లైటు వెలుగుతోంది. ఈ ఇరవయ్యూ పట్టుకెళ్ళి నేనిచ్చేనన్చెప్పి వాడికిచ్చేద్దూ," అని తోటి గుమాస్తాకి పని బెత్తాయించేడు. తోడి గుమాస్తా వెళ్ళేడు.

కాస్సేపటికి తోడిగుమాస్తా సుధాకరంతో మాట్లాడ్డం ఆ మేడగది కిటికీలోంచి కనిపించింది బాబులికి. అంతలో ఆ గదిలోకి, "రవిగాణ్ణా ఉన్నాడు. రవిగాడేనా? ఆఁవాడే" వచ్చేడు. ఆ తరవాత దీపం ఆపుచేసి ముగ్గురూ అటెక్కడికో వెళ్ళినట్టున్నారు.

చలికాలం. సాయంకాలం ఆరుంపావు దాటి పావుగంటయింది. వీధి దీపాలు వెలిగేవున్నాయి. వీధంతా సందడిగా ఉంది. బాబులింట్లో ఇంకా దీపాలు వెలిగించలేదు. చీకటిగా చిరు చలిగా ఉంది. పెద్దకూతుళ్ళు ముగ్గురూ, పక్క వాటావాళ్ళ వార పత్రికలు చదవడాని క్కాబోలు, వెళ్ళేరు. మగపిల్లలింకా ఇంటికి రాలేదు. ఆఖరిదానికి రూపాయిపావలా ఇచ్చి "అరువుకొట్టుకి వెళ్ళి రేపన్ని తెస్తాను, అందాకా రెండు శేర్లు బియ్యం పట్రా తల్లీ" అన్చెప్పి దాన్ని బజారుకి పంపించి గదిలో వాలుకుర్చీలో వాలేడు బాబులు. తీర్చవలసిన ముఖ్యమైన

నెలవారీ అప్పులన్నీ తీరాయి. సుధకి ఇవ్వవల్సినవాంట్లో పది కలిసొచ్చాయి బాబులికి. ఇంకా ఏదో బెంగగా ఉంది. ఏదో ముఖ్యమైన ఘోరవిషయం మర్చిపోయి ఏదో మరిచేసిన్న సంగతప్ప మరేదీ గుర్తుకి రానివాళ్ళా కూర్చున్నాడతను. ఓసారి ఆఫీసుకికాద్దు కాఫీహొటేల్లో మర్చిపోయిన్నాడు ఇలాగే గిజగిజ లాడేడు. సరిగ్గా అర్ధరాత్రి గుర్తుకొచ్చిందా సంగతి అనా డతనికి.

అలా ఆలోచిస్తూ కూర్చునేసరికి అలిసిపోయిన ప్రాణానికి విశ్రాంతికోసం అతని వళ్ళంతా రాత్రి తొమ్మిద్దాకా చిన్న కునుకు తీసింది. తొమ్మిదికి అతని పెద్దకొడుకు "భోజనానికి లే నాన్నా!" అంటూ అతన్ని తట్టి లేపేడు. అంతవరకూ మర్చిపోయిన విషయం కొడుకుని చూడగానే అప్పుడు తటాల్న గుర్తుకిరాగా లబో లబో మంటూ కుర్చీలోంచి లేచేడు బాబులు.

రాత్రి పదయింది. ఆలస్యంగా లేచిన చంద్రుడు పాడుబడ్డ డాబాఇంటి వంటరిగది గుమ్మంలోంచి ఆ గదిలోకి వీధిలేక చూస్తున్నాడు. చాకింటి తెల్లచీరెలా కాకుండా మాసిన సైనుపంచెలా జాలిగా 'అసహ్యంగా' ఉంది వెన్నెల. వీధంతా నిర్మానుష్యంగా ఉంది. వీధిలో ఎలక్ట్రిక్ దీపాల బల్బులన్నీ అల్లరిపిల్లలు చితగ్గొటగా, ఆ స్తంభాలన్నీ కళ్ళుపోయిన బక్కచిక్కిన పెద్దసైజు ముసలికొంగల్లా కనిపిస్తున్నాయి. రవీ అతనిభార్యా వీధిమెట్టుమీద కాళ్ళు పెట్టుకొని గదిగుమ్మంలో పక్క పక్కల కూర్చొని దగ్గరదగ్గరగా అతినెమ్మదిగా ఏదో మాట్లాడుకొంటున్నారు. అద్దెబాధ తీరినా వాళ్లల్లో ఇంకేవేవో బాధలు కనిపిస్తున్నాయి, కనిపించకుండా దాగుంటున్నాయి. రాత్రివేళ గుడ్డివెన్నెల్లో చెట్లఆకుల చీకట్లో పాములకి భయకి లేచిపోయి గూటిఅంచున ముడుచుకు కూర్చున్న గువ్వపిట్టల్లా ఉన్నారు వాళ్లు.

అంతలో అక్కడకి చింపిరిజుట్టుతో మాసుముఖంతో ఫిడేల్ డొక్కులాంటి ఛాతీతో బాజాకర్రల్లాటి కాళ్లూచేతుల్తో, పసులైన ముసిలిచొక్కాతో పసునెక్కిన పాత పంచెతో రవికి వేలువిడిచిన మేనత్తకొడుకు బాబులనే జగన్నాధం గోలుగోలునవచ్చి, "పెద్దవాడి పరీక్షకి ఫీజుకట్టాలి. పెనాల్టీతో రేపే ఆఖ్రరోజు. కట్టకపోతే ఏడాదివేస్తు. లైఫ్‌లో ఏడాది వేస్తుంటే ఎంత ఘోరమో ఆలోచించు, నాయందు దయుంచి ఆసొమ్ము నాకెయ్యి. రేపీపాటికి ఎక్కడైనా తలైనా తాకట్టుపెట్టి — ఇప్పుడుమట్టుకు నువ్వేలాగైనా సర్దాలి!" అంటూ గొల్లునగోలపెట్టి తన గోడుగోడంతా చెప్పుకొని రవి తెచ్చుకున్న సొమ్ము తనకి అప్పిమ్మన్నాడు.

"ఓరే బాబులుబావా! నువదగ్గిర పట్టుకొచ్చిన పాతిక్కి ఇవిగో ఇవి మిగిలేయి. నాకో రూపాయుంచి నువ్వోరెండు తీసుకో, కావలిస్తే" అని నెమ్మదిగాచెప్తూ మూడు రూపాయికాగితాలు చూపించేడు రవి.

"తేరా బాబూ తే!" అంటూ ఆ రెండు రూపాయలూ తీసుకొని మిగతా సొమ్ము నీదగ్గిరలేదు సుధగాడిదగ్గరలేదు ఎవడిదగ్గిరా లేదు, ఇప్పుడువెళ్ళి మరింక ఎక్కడ ముష్టెత్తడం, ఎవర్నెత్తికొట్టడం, ఏగంగలో కురకడం?" అంటూ బాబులు చేతులు పిసుకున్నాడు, జుట్టుపీక్కున్నాడు; గుండె బాదుకున్నాడు, అయిదునిమిషా లలా ఏడ్చేడ్చిన బాబులు ఎందుకోగాని అకస్మాత్తుగా ఆగిపోయి, కొన్నిక్షణాలపాటు అలా నిశ్చలంగా నిశ్శబ్దంగా ఏదోఆలోచిస్తూ నిల్చొని ఆ తరవాత రవివైపు తలెత్తిచూసి, "రవీ! ఒక్కమాట!" అన్నాడు.

ఏమిటన్నట్టు చూసేడు రవి. "మనల్ని ఇలా ఉంచినవాడు దేవుడే అయితే వాడు దేవుడుకాడు; మనల్ని ఇలా ఉంచినవాళ్లు మనుషులైతే వాళ్ళు మనుషులుకారు. మాకు ఈ చావే చాల్నని మనం ఇలా ఉండిపోతే మనం పశువులం కూడా కాము!" అని, ఉడుకులెత్తిన మరుగునీళ్ళు కుంపటిదిగి చెప్పినట్టు చెప్పి వెళిపోయేడు బాబులు.

వీధిలో మకిలివెన్నెల ఆరిపోయిన పాత దీపాల స్మృతిలా ఉంది. వీధంతా పాత పట్నపు పాడుబడ్డ వీధిలా నిర్జనంగా నిస్సహాయంగా ఉంది. అంతటా చలిచలిగా అతిచలిగా ఉంది. భార్యముఖంలోకి చూసేడు రవి. ఆమె ఎందుకోగాని దుఃఖాన్ని అణచుకోబోతూ అణుచుకోలేక వెక్కివెక్కి ఏడవడం ప్రారంభించింది. అర్ధరాత్రివేళ నట్టడవిలో కటికచీకట్లో కూరుకుపోయిన ఆడపిల్ల ఆర్తనాదంలా ఆ ఏడుపు అతిభయంకరంగా ఉంది. అమితదీనంగాఉంది.

అలా ఏదో ఆలోచిస్తూ ఆలోచిస్తూ కూర్చున్న రవి కొంతసేపయాక లేచి నిలబడి భార్యని లేవనెత్తేడు. మరి కొంతసేపటికి మసకచంద్రుడు పశ్చిమానికిదిగేడు ●

